క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం

జమ్మలమడుగు : జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుమలత, డాక్టర్ మృదుల, మేరీ శ్రావణి, ఎల్ఐసీ అధికారులు, అపోలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె ఎంఈఓ 2గా అనిత

వీరపునాయునిపల్లె : మండల విద్యాశాఖాధికారి 2గా అనిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. దిగువగొట్టివీడు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఆమె వీరపునాయునిపల్లె 2వ ఎంఈఓగా బదిలీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరనాయక్

ముద్దనూరు : మండల విద్యాశాఖాధికారి-2గా నాగేశ్వరనాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విద్యాశాఖలో అమలుచేస్తున్న పథకాలను బాధ్యతగా నిర్వహిస్తానన్నారు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని సంగాలపల్లె, మిట్టపల్లె ఎస్సీ కాలనీ, లింగాల గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొంటారని మండలఅధ్యక్షుడు రఘునాథ రెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎంఎం గంగులయ్య తెలిపారు. బుధవారం స్థానిక పాత బస్టాండు సమీపంలో ఉన్న మెప్మా కార్యాలయంలో పొదుపు సంఘాల ఆర్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా బ యోమెట్రిక్, జగనన్న మహిళా మార్ట్ ప్రోగ్రెస్, పొదుపు సంఘాల సమావేశాలు, ఇళ్ల లబ్ధిదారుల అమౌంట్ పెండింగ్ విషయాలపై చర్చించడం జరిగిందన్నారు.

నూతన లెప్రసీ కేసులను గుర్తించాలి

తొండూరు : మండలంలో నూతన లెప్రసీ కేసులను గుర్తించాలని పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా తెలిపారు. బుధవారం తొండూరు పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి ఎల్‌సీడీసీ కొత్త కుష్ఠు కేసులను గుర్తించేందుకు ఆయన శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 26వ తేదీనుంచి వచ్చేనెల 16వ తేదీవరకు ఇంటింటి సర్వే ద్వారా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అందరికీ మచ్చలు పరీక్షించి కొత్త లెప్రసీ కేసులను గుర్తించాలన్నారు. అలాగే గర్భవతులు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే ఆరోగ్య సేవలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సింహాద్రిపురం : మండల పరిధిలోని హిమకుంట్ల గ్రామంలోని వాటర్ ట్యాంక్ దగ్గర బుధవారం కంపచెట్లలో జూదమాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ. 4,200ల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రోషన్ తెలిపారు.

హాస్టళ్లల్లో డీడీటీ పిచికారీ

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ వసతి గృహాలలో దోమల నివారణకు ముందు జాగ్రత్తగా డీడీటీ పిచికారి చేయిస్తున్నామని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. బుధవారం జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో డీడీటీ పిచికారీ చేశారు. హాస్టళ్ల వార్డెన్లు, ఆశా కార్యకర్త రమీజా తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్య కోసం ప్రభుత్వం ఎంతో కృషి

వేంపల్లె : బాలికల విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని పాఠశాల హెడ్మాస్టర్ నారాయణమ్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని వైఎస్సా ర్ కాలనీలోని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులను సంప్రదించి తమ పిల్లలను ఇంటర్‌లో చేర్పించాలని అధ్యాపకులు కరపత్రాలను పంపిణీ చేశారు.

సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సహకారంతో న్యాక్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు స్కిల్ కళాశాల ద్వారా 120 రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు న్యాక్ అకాడమీ ఇన్‌చార్జి రాకేష్ తెలిపారు. సర్వేయర్, ఫీల్డ్ ఇంజనీర్, వాషింగ్ మిషన్, సోలార్ ఇంజనీర్ వృత్తి విద్యా కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల ఐటీఐ, డిప్లమో, డిగ్రీ చదివిన అభ్యర్థులు ఈనెల 25వ తేదీలోపు న్యాక్ అకాడమిలో సంప్రదించాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్లు, 600 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 9985142155, 9000517637 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



తొండూరులో యోగాసనాలు చేస్తున్న విద్యార్థినులు

పులివెందుల టౌన్/రూరల్ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని లయోలా పాల్‌టెక్నిక్ (వైఎస్ఆర్ఆర్) కళాశాల ప్రిన్సిపాల్ బ్రిట్టో తెలిపారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు యోగా గురువు ఓం ప్రకాష్ హాజరై విద్యార్థులకు యోగా సాధన గురించి, యోగా చేయడంవల్ల కలిగే ప్రయోజనాల గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. అలాగే పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ యోగాసనాలు చేయించారు. స్థానిక ఫుడ్‌సైన్స్‌అండ్‌టెక్నాలజీ కళాశాలలో డీఎస్ ఎం.ఎస్.భేగ్ ఆధ్వర్యంలో యోగా గురువులు వెంకటరెడ్డి, రంగారెడ్డిలచే విద్యార్థులకు యోగాభ్యాసం చేయించారు. అలాగే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు రామచంద్రమిషన్ సభ్యులు శివమోహన్ రెడ్డి, విజయ, సత్యంలచే యోగాసనాలు చేయించారు.

జెఎన్‌టీయూ కళాశాలలో.. :

పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర ఆధ్వర్యంలో యోగా గురువు వెంకట్రామిరెడ్డి విద్యార్థులచే యోగాసనాలు చేయించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు శేష మహేశ్వరమ్మ, మనీషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : యోగావలన ఆరోగ్య సమస్యలు, ఒత్తిడిని జయించవచ్చునని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో.ఆర్డినేటర్ కోటేశ్వరి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దీప్తి, ఎఫ్ఓ దినేష్‌కుమార్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో :

పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ యోగాంజనేయులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దితత్సోవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, పీడీ తేజేంద్ర, అధ్యాపక, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో.. :

పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోనూ, తాళ్లపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతిసాయి ఆధ్వర్యంలోనూ, వేంపల్లె వైఎస్సార్ పార్కులో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మీగాయత్రి మాట్లాడుతూ యోగా చేయడంవలన రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు.

శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో.. :

వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల క్రీడా మైదానంలో అన్ని రకాల యోగాసాలు చేసి వాటి యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, బీజేపీ నాయకులు సుష్మా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ తులశమ్మ యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. యోగా గురువు ఓం ప్రకాష్ హాజరై విద్యార్థినులకు యోగాతో కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పీహెచ్‌సీ డాక్టర్ అరిఫుల్లా, డాక్టర్ ముక్తార్ అహమ్మద్, డాక్టర్ నాగముని నాయక్, డాక్టర్ వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో యోగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యోగ ద్వారా ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రతి రోజు ఉదయం అరగంట యోగ చేయడం వల్ల రోగాలు దూరం అవుతాయని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. బుధవారం కోర్టు ఆవరణలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ గురువులు సీవి లక్ష్మీరాజు, రామకృష్ణారెడ్డిలు యోగ నిర్వహించారు. న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని, ఆసనం-ఆరోగ్య శాసనం అని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆ కళాశాలలో ప్రపంచ 9వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాసనాలు చేయించారు. వామప్, సూర్య నమస్కారాలు, అడ్వాన్స్‌డ్ పిరమిడ్ తదితర ఆసనాలు వేయించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరులో...

చెన్నూరు : యోగాతో శ్వాస మీద ధ్యాస ఉండడమే కాకుండా, మానసిక ఆరోగ్యం, జీవితానికి సరికొత్త ఉల్లాసం కలిగిస్తుందని డీఎల్‌పీఓ మస్తాన్‌వలి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు తెలిపారు. బుధవారం చెన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, చెన్నూరు సచివాలయాల కన్వీనర్ శ్రీనివాసరాజు, ఆర్ఎంపీ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జెఎన్‌టీయూలో యోగ సాధనలో విద్యార్థులు



ట్రిపుల్ ఐటీలో యోగ విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు



జమ్మలమడుగులో యోగ చేస్తున్న జడ్జి, న్యాయవాదులు

వేలం పాట వాయిదా

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని శ్రీమాధవ-ఆంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర దేవాలయ భూముల వేలం పాటను వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు తెలిపారు. గతంలో రెండు సార్లు వేలం పాటకు తేదీని నిర్ణయించి వాయిదా వేయడం జరిగింది. దీనిపై ఆలయ ఈఓను వివరణ అడగగా.. గతంలో రెండు సార్లు వేలం పాట వేయుటకు నిర్ణయించగా పోలీసులు బందోబస్తు కల్పించలేదన్నారు. మూడవ సారి వేలం పాట నిర్వహించేందుకు మళ్లీ పోలీసులను బందోబస్తు కోరగా గ్రామంలో వేలం పాట నిర్వహిస్తే ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతాయని బందోబస్తు ఇవ్వలేమన్నారు. దీంతో వేలం పాటను రద్దు చేశామని తెలిపారు. మరల వేలం పాటను ప్రొద్దుటూరులోని శివాలయంలో తొందరలోనే నిర్వహిస్తామని తెలిపారు. బందోబస్తు విషయమై ఎస్ఐ శ్రీనువాసులును వివరణ కోరగా.. గతంలో దేవాలయ భూముల వేలం పాట విషయంలో గ్రామంలో గొడవలు జరిగాయని దీనిపై గ్రామంలో శాంతి కమిటీ ఏర్పాటు చేసి గ్రామస్తులతో చర్చించి వేలం పాట వేయుటకు చర్యలు తీసుకుందామని దేవాలయ ఈఓకు తెలుపగా ఆయన స్పందించకపోవంటతో బందోబస్తు ఇవ్వలేమని ఈఓకు తెలిపామన్నారు.

జులై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతున్న జగనన్న సురక్ష కార్యక్రమం జులై 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 15 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే తేదీల వివరాలను తెలిపారు. 1వ తేదీ పాయసంపల్లె, 3న అనిమెల, 4న వెల్దుర్తి, 5న మొయిళ్లచెరువు, 6న కొమ్మద్ది, 10న వీరపునాయునిపల్లె, 11న అలిదెన, 12న ఎన్.పాలగిరి, 13న ఉరుటూరు 2, 14న ఎస్ పాలగిరి, 17న ఉరుటూరు1, 18న యు.రాజుపాలెం, 19న తలపనూరు, 20న ఇందుకూరు, 21న గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అర్చకుల ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలి

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపులలో ఉన్న శ్రీ మాధవ-ఆంజనేయ దేవస్థాన అనువంశిక అర్చకులు మాధవాచార్యులు ఆధీనంలో ఉన్న ఇనాం భూముల సమస్యలను అధికారులు పరిష్కరించాలని రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీనువాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అర్చక సమాఖ్య సభ్యులతో మాధవస్వామి దేవాలయం వద్ద శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ఈఓ రామచంద్రాచార్యులు దేవాలయ అర్చకుల మీద కక్షకట్టి ఆయన ఆధీనంలో ఉన్న భూములను వేలం వేయుటకు నిర్ణయించటంతో సమస్యను దేవాలయ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వేలం పాటను రద్దు చేయించామని తెలిపారు. ఆలయ ఈఓ భూములు వేలం వేసే విధానంను వెనక్కి తీసుకుని సదురు ఆలయ అర్చకునికి చట్టపరంగా రావలసినటువంటి ప్రభుత్వ లబ్ధిని వారికి అందజేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులను ఆదుకునేదానికి 439 జీఓ తెస్తే కిందిస్థాయి ఎండోమెంట్ అధికారులు అర్చకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు.

అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ వినోద్‌కుమార్



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్, కమిషనర్ నరసింహారెడ్డిలు

పులివెందుల : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎవరైనా దొంగతనాలు, ఇతర ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులను మోడల్ టౌన్‌గా అభివృద్ధి చేయడానికి రూ.630కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అయితే కొంతమంది ఆకతాయిలు అభివృద్ధి పనులు జరిగే చోట లైటింగ్‌కు సంబంధించిన వైర్లు, గ్రిల్స్, పైపులు, ఇతర సామగ్రిని దొంగతనం చేసి స్థానికంగా ఉన్న గుజిలీ షాపులలో అమ్ముకోవడం జరుగుతోందన్నారు. వేల రూపాయలు విలువైన వస్తువులను గుజిలీ షాపులో రూ.1000లకు అమ్ముతున్నారన్నారు. దీనివల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలగడమే కాకుండా ప్రభుత్వ ఆస్తికి నష్టం జరుగుతుందన్నారు. ఇకపై గుజిలీ షాపు వారు ఎవరూ అటువంటి వస్తువులను కొనుగోలు చేయరాదన్నారు. గుజిలీ షాపు యజమానులకు ఈ సందర్భంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా దొంగతనం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండి దొంగతనాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి తెస్తే వెంటనే పోలీసులకు కానీ, మున్సిపల్ అధికారులకు కానీ సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు హుస్సేన్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

ప్రజలందరూ కలిసిమెలసి జీవించాలి

సింహాద్రిపురం : ప్రజలు ఎటువంటి గొడవలకు పాల్పడకుండా కలిసిమెలసి జీవించాలని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అంకాలమ్మగూడూరులో పోలీసు పికెట్‌తో పాటు గ్రామసభకు డీఎస్పీ హాజరై మాట్లాడారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

చక్రాయపేట : ప్రతి రైతు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించు కుంటే మంచి ఫలితాలు పొందేందుకు అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని కుమార్లకాల్వ రైతు భరోసా కేంద్రం పరిధిలో జరుగుతున్న భూసార పరీక్షలను పరిశీలించి మాట్లాడారు. భూసార పరీక్షలు చేయిస్తే రైతులు తమ పొలంలో ఎరువుల మోతాదు ఎంతవరకు అవసరమో తెలుసుకోవచ్చునన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి నవంత్‌బాబు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

వల్లూరు : ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అందుకోవడానికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించి జగనన్న విద్యా కానుక పంపిణీ గురించి, వాటి నాణ్యత గురించి చర్చించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డుల పనితీరును పరిశీలించి, ఉపాధ్యాయులతో వాటి ఉపయోగాలను గురించి ఆరా తీశారు. బాలికల వసతి గృహంలో అడ్మిషన్‌ల గురించి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులు పా ల్గొన్నారు.

పక్కాగృహాలను త్వరితగతిన నిర్మించండి

లింగాల : మండలంలోని పార్నపల్లె జగనన్న కాలనీలలో పక్కాగృహాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని పార్నపల్లెలోని ఇళ్ల లబ్ధిదారులు తహసీల్దార్‌కు విన్నవించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాయలంలో పార్నపల్లె గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల లబ్ధిదారులు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్నపల్లె గ్రామానికి 106 పక్కాగృహాలు మంజూరయ్యాయని.. ఎస్సీ, బీసీలకు చెందిన జగనన్న కాలనీలలోని పక్కాగృహాలను అనంతపురంకు చెందిన శేఖర్ అనే కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టారని.. అయితే వాటిని ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. దీనిపై తహసీల్దార్, డీటీ త్రిభువన్‌రెడ్డిలు స్పందించి కాంట్రాక్టర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించి ఆయనతో మాట్లాడారు. దీంతో డీటీ మాట్లాడుతూ గురువారం పార్నపల్లె గ్రామంలోని జగనన్న కాలనీలను సందర్శించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలపై దృష్టి సారించండి

వేముల : మండల వ్యాప్తంగా గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకట బయపురెడ్డిలు తహసీల్దార్ వెంకటసుబ్బయ్యకు సూచించారు. వేముల తహసీల్దార్‌గా ప్రమోషన్‌పై వెంకటసుబ్బయ్య బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌తో చర్చించారు. ఎక్కడైనా పొలాల మధ్య సమస్యలు ఉన్నట్లయితే త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : స్థానిక సీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం అని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సుదీర్ఘ కాలంగా మంచి వైద్య సేవలు అందిస్తున్న డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టర్ శేఖర్, 7 మంది స్టాఫ్ నర్సులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బుధవారం ఆయన బదిలీపై వెళ్లిన వైద్య సిబ్బందిని శాలువ కప్పి, పూలమాలలతో సత్కరించి మాట్లాడారు. కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది అంకిత భావంతో పని చేసారన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యుత్తమ సేవలు అందించి వారి మన్ననలు పొంది కమలాపురం ఆసుపత్రికి వన్నె తెచ్చారని వారి సేవలను కొనియాడారు. అక్కడ కూడా ఇలాంటి సేవలే అందించి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు.

మహిళలకు సువర్ణావకాశం మహిళా సమ్మాన్

వల్లూరు : మహిళలు, ఆడ పిల్లలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే ప్రధాన ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్‌ను అమలు చేస్తోందని, మహిళలకు ఇది సువర్ణావకాశమని ప్రొద్దుటూరు సౌత్ సబ్ డివిజనల్ పోస్టల్ అధికారి సునీల్ తెలిపారు. వల్లూరులోని పోస్టల్ కార్యాలయంలో మండల పరిధిలోని బీపీఎంలు, ఈడీఎంఈలు, పోస్టల్ సిబ్బందితో బుధవారం నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో మహిళలకు అనేక ప్రయోజనాలు వున్నాయని తెలిపారు. ఈ పథకంలో కనిష్టంగా రూ.1000 నుంచి గరిష్టంగా రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చునని, 2 సంవత్సరాల కాల పరిమితికి గరిష్టంగా 7.5 శాత వడ్డీతో తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలు, మైనర్ బాళికల పేరుపై వారి తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ స్కీముకు సంభందించి ఖాతాను తెరవవచ్చునన్నారు. పోస్టల్ సిబ్బంది వీలైనన్ని ఎక్కువ ఖాతాలు తెరిపించడానికి కృషి చేయాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేద్దాం

వేంపల్లె : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత తెలిపారు. బుధవారం బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

దరఖాస్తు చేసుకోండి

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా వున్న సీట్లలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి వున్న విద్యార్థులు పూర్తి వివరాలకు ఏపీ మోడల్ స్కూల్లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కార్డులు అందజేయాలి

చక్రాయపేట : ప్రతి ఆర్బీకే పరిధిలోను కౌలు రైతులను గుర్తించి వారికి కార్డులను అందజేయాలని తహసీల్దారు రాజసింహ నరేంద్ర తెలిపారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారి నవంత్‌బాబుతో కలసి వీర్వోలు, వ్యవసాయ సిబ్బందిచే సమావేశం నిర్వహించి మాట్లాడారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెద్దముడియం : మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన భీమగుండం గ్రామంలో కడప పోలీసు కళాజాగృతి డేగ బృందం వారు ఫ్యాక్షన్ , సైబర్ నేరాలపై నాటుక రూపంలో అవగాహన కల్పించారు. రూరల్ సీఐ వెంకటకొండారెడ్డి, ఎస్ఐ శ్రీనువాసులు పాల్గొన్నారు.

నేడు భూములకు వేలంపాట

ముద్దనూరు : మండలంలోని పెద్ద దుద్యాల గ్రామంలో వరదరాజస్వామి ఆలయ భూముల వేలం పాటను గురువారం నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఈవో రామచంద్రారెడ్డి బుధవారం తెలిపారు. నేటి పెద్ద దుద్యాల గ్రామంలోని శ్రీరామ ఆలయంలో ఉదయం 11గంటలకు 3 సంవత్సరముల కాలపరిమితిగాను (2023-2026)ఈ వేలం పాట నిర్వహించనున్నటు ఆయన తెలిపారు.

రేపు మండలస్థాయి క్రీడా ఎంపికలు

వల్లూరు : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు గానూ ఈనెల 23వ తేదీ ఉదయం 8.30 గంటలకు వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి లిల్లెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ జనన ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

క్రమశిక్షణ అలవరుచుకోవాలి

లింగాల : ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ అలవరుచుకోవాలని లింగాల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జ్ఞానమూర్తి తెలిపారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్, ఏపీ ఆర్థిక సమీకృత, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఎగువ లింగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో అఖిల భారత స్కూల్‌క్విజ్ మండలస్థాయి పోటీ పరీక్షలను మేనేజర్ ప్రారంభించి మాట్లాడారు.

మూగజీవాలకు టీకాలు

ముద్దనూరు : ప్రస్తుత వర్షాకాలంలో మూగజీవాలు వ్యాధులకు గురికాకుండా సకాలంలో యజమానులు వాటికి టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ యస్ఏ శ్రీనివాసులు, స్థానిక పశువైద్యాధికారి వాసా శ్రీనివాసలు సూచించారు. బుధవారం మండలంలోని పెనికలపాడు గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్ల నివారణ మందుల పంపిణీ చేపట్టారు.

మండలస్థాయి క్రీడా ఎంపికలు

చెన్నూరు : కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా ఎంపికలు బుధవారం మండల విద్యా శాఖధికారి షర్మిలారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ విచ్చేసి మాట్లాడారు.

వర్షానికి కోతకుగురైన వంతెన

ముద్దనూరు : మండలంలోని శెట్టివారిపల్లె గ్రామానికి వెళ్ళే ఏకైక రహదారి వంతెన వర్షంనీటి ప్రవాహానికి కోతకు గురైంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గాలేరు-నగరి ప్రధాన కాలువపై నిర్మించిన ఈ వంతెన కోతకు గురికావడంతో గ్రామస్తులకు గ్రామంలోకి వెళ్ళడానికి మార్గం స్తంభించింది. గాలేరు-నగరిపై నిర్మించిన ఈ కాలువ ఎప్పుడు కొద్దిపాటి వర్షం వచ్చినా కోతకు గురవుతోందని, ఇప్పటికి నాలుగు సార్లు కోతకుగురికావడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని గ్రామస్తులు తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణారెడ్డి తాత్కాలికంగా వంతెనకు మరమ్మతులు చేపట్టారు.